ఈవారం కథ

అతన్ని చదివించండి

మరాఠీ మూలం: సురేంద్రనాయిక్
అనువాదం: కొక్కుల పద్మావతి

“క్రాశి ఇంట్లో వుందా?”

మార్వాడివాళ్ళ ఇంట్లోని పాలేరు వచ్చి గట్టిగా పిలిచాడు. నేను లేచి వాకిట్లోకి వచ్చి ఎందుకు? అని అడిగాను.

అతడు నావైపు అదోలా చూసి ఒరే అబ్బిగా నీవెవరవిరె అని అడిగాడు.

“నేను మా నాన్న కొడుకుని?”

“తెలుసులేవోయి, మీ నాన్న కొడుకువే, కాని మీ నాన్న పేరేమిటి?”

“మారుతి!”

“అలాగా! మారుతి కొడుకువా!”

“అయితే మీ అమ్మ ఎటు వెళ్ళింది?”

“నీళ్ళకు, ఏం?”

ఇంతలో అమ్మ చేతిలో బకెట్, తలపై బిందెతో పరుగు పరుగున వస్తున్నది. నీళ్ళు ఒలికిపోవడంవల్ల చీర అంతా తడిసిపోయింది. వెంట్రుకలు కళ్ళపైన పడుతున్నవి. బకెట్ కింద పెట్టి వెంట్రుకలు సవరించుకున్నది. అప్పుడే అమ్మ దృష్టి వచ్చిన మనిషిపైన పడింది.

“ఇవాళ మెంఢల్‌వారి చేనులో పని వున్నది. నీ పనులు తొందరగా ముగించుకొని మిగతా ఆడవాళ్ళను తీసుకొని తొందరగా రా! నీవు లేనిదే వారు తొందరగా బయిలుదేరరు”

“మంచిది. కాసేపట్లో వస్తున్నాము ... అయినట్లే ...”

అమ్మ పనులన్నీ గబగబా ముగించుకుని నావంక చూసింది. “బాబు తొందరగా తిను. ఇవాళ బడికి వెళ్ళకు. పనికి వెళ్తే డబ్బులు బాగా వస్తవి, ఏదో చిల్లరకు, కూరగాయలకు అవుతవి. మొత్తం భారం మీ నాన్నమీదే వేస్తే ఎలా? నీకు కూడా చిరుతిళ్ళు అవి కావాలాయే”

“ఉండవే ఎప్పుడు ఇదే నస, నన్ను మాస్టారు కొడతారు. ఆ దామ్యా చూడు. రోజు ఎంచక్కా బడికి వెళతాడు. నీవు ఎప్పుడు చెబుతుంటావు, నాన్న నీకు మంచి బట్టలు కుట్టిస్తాడు, పుస్తకాలు కొనిస్తాడు అని, ఏది? ఎప్పుడు!”

“ఈ వారం కూలి బాగా లభిస్తుంది. నేనే మార్వాడి దుకాణంలో నీకు బట్టలు కొనిస్తాను. నా బాబువికదా! ఆ దామ్యా గాడి నాన్నలాగా శ్రీమంతులు కాదురా మీ అమ్మా నాన్నా, మనం బీదవాళ్ళం” అని అమ్మ గంభీరంగా చెపుతున్నది.

తొందరగా అన్నం తిని నేనే ముందు వెళ్ళాను. అమ్మ అన్నీ సర్దుతుంది. నాన్న ప్రొద్దున్నే పనికి వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనానికి వస్తాడు. అమ్మ ఎప్పటిలాగే అశోక్‌ని బుజ్జగిస్తుంది.

“అశోక్” ఎటువెళ్ళాడబ్బా కొడుకు?

అమ్మ ఒకసారి పిలిచి ‘మంది’కి పాలిచ్చింది. “కడుపునిండా తాగమ్మా, నేను ఇప్పుడే రాను. అన్నయ్య వుంటాడు.”

అశోక్ వచ్చాడు. వాడిని చూసి మళ్ళీ అమ్మ అంటున్నది.

“ఇంటిమీద మిరపకాయలు ఎండబెట్టాను. సాయంత్రం తీయి. మీ నాన్న మధ్యాహ్నం తినడానికి వచ్చినప్పుడు భోజనం తీసి పెట్టు. ఇంటిదగ్గరే వుండు, లేకపోతే మీ నాన్న నిన్ను కొడతాడు ‘మంది’ని ఏడిపించకు నేను వచ్చేదాకా...”

అమ్మ చెపుతూనే వుంది.

“నేను మందిని చూడను. అది దొడ్డికి పోతుంది. మూత్రం పోస్తుంది. ఏడుస్తుంది. చెల్లికి నేనే అన్నీ చేయాలి నీకేంటి బాగానే వుంటావు!”

“మన చెల్లెలు కాదా నాన్న, మనం చూడకపోతే ఎవరు చూస్తారు చెప్పు”

“అన్నయ్యను నాతో తీసుకుపోతున్నాను. నీవు చెల్లాయిని మంచిగా చూడు. వచ్చేటప్పుడు నీకు పల్లికాయలు తీసుకువస్తాను. మా మంచి నాన్నకదా” అమ్మ బుజ్జగిస్తుంది.

“వెళుతున్నాను తలుపులు వేసుకో” అమ్మ అని బయలుదేరింది. నేను సంతోషంగా వెళుతున్నాను. మెంఢల్‌వారి చేలో పని అంటేనే నాకు చాలా ఇష్టం. నేను, మా మిత్రులు కలిసి వెళుతున్నాము. నేను అందరికన్నా ముందున్నాను. మేము హుషారుగా నడుస్తున్నాము. ఇలా నడుస్తూనే రోజు గడిచిపోవాలనిపించింది.

చేలోకి వచ్చి పనిలో చేరాము. రెండు మడులు విత్తనాలు అలకడం అయిపోయింది. ఆడవాళ్ళు కొంచెం విశ్రాంతి తీసుకొని ఆకు-తంబాకు వేసుకుంటున్నారు. అంతలో మేము పిల్లలం హౌజు దగ్గరికి వెళ్ళి నీళ్ళు త్రాగి అక్కడే నీళ్ళలో బాగా ఆడాము. కొంచెం సేపటికి పాలేరు పిలుపు రాగానే మళ్ళీ వెళ్ళాము. మధ్యాహ్నందాకా పని చేశాము. సగం చేను అలకడం అయిపోయింది. నాకు చాలా దాహం వేస్తున్నది. హౌజు దగ్గరికి వెళ్ళాలంటే దూరంగా వున్నది. ఆడవాళ్ళందరూ ఇంటి నుండి నీళ్ళకోసమని చెరొక కుండ తెచ్చుకున్నారు. మా అమ్మ కూడా తెచ్చింది కాని అవి అయిపోయాయి. వేరేవాళ్ళ కుండలోని నీళ్ళు త్రాగాలి ఇక అని అనుకున్నాను. అక్కడ వున్న కుండలదగ్గరికి వెళ్ళి ఒక కుండ ముట్టుకున్నాను. ప్రక్కకు వంచాను. దోసిలిలో పట్టుకొని త్రాగుతున్నాను అంతే నా తోటి పిల్లవాడు గంగడు నన్ను చూసి ఒకటే గట్టిగా అరవసాగాడు.

“అమ్మా వాడు మన కుండని మైల చేసినాడు.”

అందరి దృష్టి నామీద పడింది. గంగడి అమ్మ నన్ను శాపనార్థాలు పెడుతున్నది.

వీడికి ఏం పోయేకాలం వచ్చింది వీడికి ఏ దయ్యం పట్టింది. ఏ రాక్షసుడు వీడి కడుపులో దొరబడ్డాడు. వాడి కళ్ళకు ఏ కుండ కనబడలేదా? వాడికళ్ళు చీకట్లు కమ్మినాయా? వీడి దినం పెట్టా, శ్రాద్ధం పెట్టా అని నానావిధాల తిట్టుకుంటూ సరాసరి కుండదగ్గరికి వచ్చి కుండలోని నీళ్ళని కుమ్మరించింది.

ఇక మా అమ్మవంక చూస్తూ, తీసుకో ఇక ఈ కుండ వాడి బొందమీద పెట్టు. చిన్నదో పెద్దదో కుండ వుండే, అది కూడా పోయింది.

అమ్మ వింటున్నది. ఏమనుకుందో ఏమో నా దగ్గరికివచ్చి చెడామడా రెండు మూడు వాయించింది. మిగతావాళ్ళు పోనిలే పిల్లవానికి తెలియదు. కుండ ముట్టుకుంటే ముట్టుకున్నాడు కొడితే మాత్రం ఏ లాభం? అది మట్టిది కాబట్టి సరిపోయింది. ఏ ఇత్తడి, రాగిది అయితే దాన్ని గోమూత్రంతో శుద్ధిచేసి ఇవ్వాల్సి వచ్చేది లేనిపోని తంటా తప్పింది! అని అంటున్నారు. నాకంతా అగమ్యగోచరంగా వుంది.

అమ్మ కుండ తీసుకుంది. నాకు భలే తమాషాగా వుంది. రెండు మూడు రూపాయిల కుండైతే వచ్చింది అని సంతోషం వేసింది. కాని కొంచెం బాధకూడా కలిగింది. వీరు ఎందుకిలా చేస్తున్నారు నేను విచారిస్తున్నాను. ఈ ప్రాణం లేని కుండ ఎలా మైలపడింది. అందులోని నీళ్ళు ఎలా మైలపడినవి. కుండ కాబట్టి ఇచ్చేశారు. అదే ఇత్తడి, రాగి బిందే అయితే వీరు పారేసేవారా? నాకు చాలా కోపం వచ్చింది. ఆ రోజంతా అదోలా గడిచింది.

సాయంత్రం వేళ పని ముగిసింది. ఆడవాళ్ళందరు ఇంటికి వెళ్ళారు. అమ్మ వెనుక

వుంది. మేకకోసం గడ్డి కోసుకున్నది. అమ్మ తలమీద మోత వుంది. ఆమె నడుస్తుండగా అది కల్‌కల్‌మని చప్పుడు చేస్తున్నది. అమ్మ వెనక్కి తిరిగి చూసింది. నేను వెంటే నడుస్తున్నాను.

అమ్మ తిట్టడం ప్రారంభించింది. “వాళ్ళ కుండని ముట్టుడు (మైల) చేశావు. నీ మూలంగా ఇవాళ నేను తల దించుకోవాల్సి వచ్చింది. బయట ఎలా మెలగాలో నీకు తెలియదా? లోకం చూస్తే ఒకవిధంగా వుంది. నీవు చూస్తే ఒకవిధంగా వున్నావు. ఏం చేయాలో తోచడంలేదు.”

“అరే, ఆ కుండ ఎలా మైలపడిందో నాకు ఇప్పటికి అర్థం కావడంలేదమ్మ?” అని అన్నాను.

“అర్థం అయేట్లు చెప్పాలా నీకు?”

నేను మాత్రం చాలా అన్యమనస్కంగా వున్నాను. నాకు చాలా బాధగా వుంది. వీరెందుకిలా చేస్తున్నారు. మనుష్యులంతా ఒకే రక్త-మాంసాలతో పుట్టారు కదా? వాళ్ళు మేము ఒకలాగే వున్నాము కదా? మరి వాళ్ళెందుకు మమ్మల్ని మైల అంటున్నారు? నా ఆలోచనలు పరిపరివిధాలా పోవుచున్నవి. నాకేమీ బోధపడటంలేదు.

కొన్నాళ్ళకు మార్వాడివాళ్ళు కొత్త దివాన్‌జిని పెట్టుకున్నారు. అతడు ముస్లిమ్. ఆయన ఎవరిజోలికి పోయేవాడుకాదు. తన పనేమిటో తానే చేసుకుపోయేవారు. అందరితో అమ్మ-అయ్యా అంటూ పనులు చేయించుకునేవాడు. ఈరోజు తెల్లవారగానే మా ఇంటికి వచ్చాడు. అమ్మ పొయ్యిమీద నీళ్ళు కాగపెడుతుంది.

“కౌసల్‌బాయి, కౌసల్‌బాయి వున్నారా ఇంట్లో?” అతను గట్టిగా పిలిచాడు.

నేను అరుగుమీదే వున్నాను. వెంటనే బయటకు వచ్చాను, ఏమిటి ఇవాళ పిలుపు కొత్తగా వినిపిస్తుంది అని అనుకున్నాను. ఆ పిలుపు రోజులాగా కించపరుస్తున్నట్లుగా లేదు. మనుష్యులు మనుష్యుల్ని మానవతా దృష్టితో పిలిచినట్లుగా వుంది. నేను అతన్ని ఆశ్చర్యంగా చూశాను. ఇంతకు ముందున్న మనిషికాడతడు. ఇతడు వేరేఅతను. ఫకీర్ బాబాలాగా వున్నాడు. అతను మొదటిసారిగా అమ్మను కౌసల్‌బాయి అని గౌరవించి పిలిచాడు. అతని గడ్డం నెరిసింది. ‘పూనా ప్యాంటు’ ధరించాడు. చేతిలో గొడుగు, నోటిలో తాంబూలం మొఖంమీద ఒకవిధమైన తేజస్సుతో మెరుస్తున్నాడు అతడు. అతన్ని చూడగానే నాకు చాలా బాగా అనిపించింది. గౌరవభావం ఏర్పడింది.

“మీరెవరు?” నేనన్నాను.

“ ‘బేటా’ నేను దివాన్‌జిని, మార్వాడి వాళ్ళ ఇంటికి కొత్తగా వచ్చినవాణ్ణి” అని అంటుండగా అమ్మ “ఎవరు?” అంటూ బయటకు వచ్చింది. కొత్త మనిషిని చూడగానే నెత్తిమీద కొంగు వేసుకుంది.

“కౌసల్‌బాయి మీరేనా?” అతనన్నాడు.

“అవును, నేనే ... కూర్చోండి ...”

“వద్దు, వద్దు, నేను వెళతాను. ఇంకా కొంతమందికి చెప్పాలికదా! ఇక్కడ నాకు అంతా కొత్త. అందరి ఇళ్ళు తెలుసుకుని వాళ్ళకు చెప్పాలి”

“ఉండండి. చాయి పెడతాను. తాగి వెళుదురుగాని, బాబూ పరుగున వెళ్ళి చాపత్తీ తీసుకురా?” అమ్మ అన్నది.

వద్దండి, వెళతాను దివాన్‌జీ అన్నాడు.

“ఎందుకు మా ఇంట్లోని చాయి తాగరా మీరు? మీకు పనికిరాదా ఏం?” అమ్మ అన్నది.

“లేదు, లేదు, అలాంటిదేం లేదు. కాని ” అంటూ అటు ఇటు చూస్తున్నాడు.

“మా ఇంటికి మీరు మొదటిసారి వచ్చారు. రెండు ముక్కలు చాయి త్రాగి వెళ్ళండి.”

అమ్మ పీట వేసింది. చాలా బలవంతంమీద అతడు కూర్చున్నాడు. నావంక చూస్తూ “వీళ్ళ నాన్న లేరా? ఎటు వెళ్ళారు?” అని అడిగాడు.

“బయటకు వెళ్ళారు. వస్తారిప్పుడు” అమ్మ సమాధానం.

అతడు అటు-ఇటు చూస్తున్నాడు. అతనికి భయం వేస్తున్నది కాబోలు. అతను కొత్తవాడు. వాడలో చాయి త్రాగుతున్నప్పుడు ఎవ్వరైనా చూస్తే ఎలా అని శంకిస్తున్నాడు.

అమ్మ చాయి నాతో పంపింది.

“ఏంటండీ?” అన్నాను.

“ఏంలేదు.”

“మీరు అటు - ఇటు చూస్తున్నారు కదా. మా ఇంట్లో చాయి త్రాగటానికి మీకు భయం వేస్తున్నదా. కుల-మత-జాతి భేదాలు పాటిస్తారా మీరు.”

“కాదు బేటా నేను కుల-మత భేదాలను పాటించను. ఈ మనుష్యులు వున్నారు చూడు వాళ్ళవల్ల భయం. నేను మీ ఇంట్లో చాయి త్రాగినట్లు వీళ్ళకి తెలిస్తే నన్ను కూడా మిమ్మల్ని చూసినట్లే అంటరానివాడిగా చూస్తారని భయం. అందువల్ల ఈ జాతిభేదం పాటించాల్సి వుంటుంది. లేకపోతే వ్యక్తిగతంగా నాకేం అభ్యంతరం లేదు.”

“వారికి మీరెందుకు భయపడతారు. వారు, మనం అంతా మనుష్యులమేకదా? మరెందుకిలా?”

అవును బేటా అంతా ఒకటే సారే అల్లాకి సంతాన్‌హై...

నేను మాత్రం ఇప్పుడు కొత్తగా కలిగిన ప్రశ్నలతో సతమతమవుతున్నాను. అమ్మకు ఏమి అర్థంకావడంలేదు. నన్ను తిట్టిన తిట్లు మరియు ఇతడు చెప్పిన జ్ఞానం నాకు ఏమిటో అద్భుతంగా తోస్తున్నది. వీరెందుకు మనల్ని ఇలా నీచంగా చూస్తున్నారని నాకు చిరాకేసింది. అతన్ని చూస్తున్నంతసేపు నేను మాత్రం సంతోషంగానే వున్నాను.

అమ్మనుద్దేశించి అతడన్నాడు.

“కౌసల్‌బాయి”

“జీ”

“మీ కొడుకు నిజంగా చాలా గుణవంతుడు. చాలా తెలివిగలవాడు. పేరు తెచ్చుకుంటాడు. అతన్ని చదివించండి. చాలా గొప్పవాడై మిమ్మల్ని ఉద్ధరిస్తాడు. నా ఆశీర్వాదం అతనివెంట వుంటుంది.” అతడు మనస్ఫూర్తిగా దీవించి నా తల నిమిరాడు. చటుక్కున లేచి వెళ్ళిపోయాడు. నేను, మా అమ్మ అతన్ని అలాగే చూస్తూ నిలబడిపోయాము. ఇప్పుడు అతడు చాలా దూరం వెళ్ళాడు.



వచ్చేవారం కథ
చావుపల్లకీ
-దాట్ల దేవదానం రాజు

5